## చిన్నికథ

# నష్టపరిహారం



కృష్ణవేణమ్మ గారికి ఒక్కగానొక్క కొడుకు సూర్యం. సూర్యం రెండేళ్ళ వాడుగా వున్నప్పుడే, మేల్ నర్సుగావున్న తండ్రి చనిపోయాడు. ఆస్పత్రి యజమాన్యం దయతల్చి ఆమెకు ఆయా పని ఇప్పించారు. అప్పట్నించి, కష్ట పడి తన కొడుకుని ఇంజనీరింగ్‌లో గ్రాడ్యుయేట్‌ని చేసింది. డిగ్రీ చేత పట్టుకుని వుద్యోగాల వేటల్లో విసిగి వేసారి పోనవసరం లేకుండానే వున్న వూళ్ళోనే వుద్యోగం దొరికింది. ట్రైనింగ్‌లో నెలకి రెండువేలు, పూర్తయిం తర్వాత నెలకు నాలుగు వేల జీతం. కృష్ణ వేణమ్మ కంటె అదృష్టవంతురాలెవరూ వుండరని అందరూ పొగిడారు. సూర్యం తల్లిని వుద్యోగం మానెయ్య మన్నాడు. అయితే, ఇంట్లో వుండి ఏం చెయ్యాలని, సోమరి తనంతో కాలక్షేపం చేసేకంటె, వుద్యోగానికి వెళ్ళడం మంచిదని ఆమె వుద్యోగం మానలేదు.

సూర్యం వుద్యోగంలో చేరి సంవత్సరం పూర్తి కావస్తోంది. సంవత్సరం పూర్తయితే, వుద్యోగం పర్మనెంటయి, నాలుగు వేలవుతుంది జీతం. అయితే అన్నీ మనం అనుకున్నట్లుగా జరగవు. కంపెనీలో కొంచెం పని వుండడం వల్ల ఆరోజు ఆలస్యంగా బస్‌స్టాపుకు వచ్చాడు. అక్కడ ఇద్దరో ముగ్గురో వున్నారు. ఇంతలో పెద్ద శబ్దం చేస్తూ బస్ వచ్చింది. ఆ రావడం మొదటి రాత్రి గదిలో అడుగు పెట్టే ఆడ కూతురి లాగాదు. తప్ప తాగి తూలినడుస్తూ వచ్చే తాగుబోతులా, ఎటు పోతోందో అర్థం గాని విధంగా వస్తోందా బస్సు. సూర్యానికి తప్పుకునే అవకాశం లేక కాళ్ళు మడత బడి బస్సుకు అడ్డంగా పడడంతో, ప్రాణాలు అక్కడి కక్కడే గాలిలో కలసి పోయాయి. కృష్ణవేణమ్మ కలలన్నీ చెదిరి పోయాయి. పోలీసులు వచ్చారు. కృష్ణమ్మ అక్కయ్య పిల్లలు వచ్చారు సాయంగా వుండి పోవడాన్కి. అంతటితో కష్టాలు అంత మయ్యాయనుకోవడం పొరపాటు. నిజానికి ప్రారంభమయ్యాయి.

ఆక్సిడెంటుకు ప్రభుత్వం పరిహారం ఇస్తుంది స్టేషన్‌కు వచ్చి తీసుకోమన్నాడు హెడ్డు. నాలుగైదు సార్లు తిరిగినా, పని జరగలేదు. ఏదో సాకు చెప్పి మళ్ళీ మళ్ళీ తిప్పుతూనే వున్నాడా హెడ్డు. ఓ పెద్ద మనిషి సలహా మేరకు ఓ రెండు వందలు కావను కుంటే, హెడ్డు దయతల్చాడు. ఇంతలో ఆ వీధిలోనే పని లేని లాయరు వున్నాడు. ఈ కేసులో ఎంత హీనంగా చూసినా పాతిక వేల రూపాయలకు నష్ట పరిహారం దొరకుతుంది. తన ఫీజు కింద అయిదు వేలు మిగలగలదని కృష్ణవేణమ్మను ఆశ్రయించాడు ఆ లాయరు. కృష్ణవేణమ్మకు సుతరామూ ఇష్టంలేదు. చెట్టంత కొడుకు పోయిం తర్వాత, డబ్బేం చేసు కుంటుంది తను. కానీ, అక్కయ్య పిల్లలు ఓ ప్రక్క, లాయరు మరో ప్రక్క పోరడంతో, మెత్తబడింది. హీన పక్షం అయిదు లక్షల దాకా నష్ట పరిహారం దొరకుతుందని ఆశచూపెట్టాడు లాయరు. కోర్టుల చుట్టూ తిరిగే స్తోమత లేదంటే, పెట్టుబడికి వెనుకాడ వద్దని, తాను సర్దగలనని, కేసు తనకు అప్ప చెప్పు న్నట్లుగాను, కేసుకాగితాలపై సంతకాలు పెట్టేచాలని ప్లీడరు ఆమెను వప్పించి కేసు చేపట్టాడు. మొత్తానికి తన ఫీజు ఇరవై శాతం, కోర్టు ఫీజులు వగైరా నెగ్గిన తర్వాత ఇవ్వచ్చన్నాడు.

కేసు వేయడం జరిగింది. కోర్టు కంటూ ఎక్కితే ఎప్పుడు ఎలా తేల్తామో ఎవరూ చెప్పలేరు. బికారులైన వారూ వున్నారు కేసు నెగ్గిన తర్వాత కూడా. కోర్టు ఫీజులు, ప్లీడరు ఫీజులు, సాక్షులను మేపడాన్కి వగైరాకనపడని ఖర్చులు,చివరకు మిగిలేది శూన్యం అంటూ వేదాంతం నేర్పుతాయి. అయితే మానవుడికి ఆశ. మంటవైపు దూసుకు వెళ్ళే శలభంలా,కోర్టు చుట్టూ తిరుగుతాడు. వారసత్వపు సర్టిఫికెట్లు సర్పంచి నుండి తేవడాన్కి ఓ అయిదువందలు సమర్పించు కోవాల్సి వచ్చింది. పైగా 'రేపు అయిదు లక్షల వస్తాయిగదమ్మా ఓ అయిదు వందలు మాకివ్వ డాన్కి బాధ పడ్తారెందుకు' అన్నారు. పోస్టు మార్టం, ఎఫ్.ఐ.ఆర్ అవన్నీ తెచ్చుకోమనడంతో దానికీ ఖర్చు పెడితే గానీ దొరకలేదు. కేసుకు సాక్ష్యానికి సూర్యం చని పోయిన నాడు బస్‌స్టాండులో వున్న వారిని పట్టుకుని సాక్ష్యానికి రమ్మనమంటే, కోర్టు చుట్టూ తిరగలే మన్నారు ఓ ఇద్దరు. లాయరు వాళ్ళను లాలించి బుజ్జగించి, చెరో అయిదువేలు ఇప్పించేలా వప్పించి సాక్ష్యాలని తయారుచేసాడు. రెండేళ్ళ పాటు కోర్టు చుట్టూ తిరిగి, సాక్షుల కోసమైతేనేమి, తనకైతేనేమి, అప్పుడప్పుడు ఖర్చు పెట్టింది లెక్కవేసుకుంటేవో అయిదువేలు తేలింది ఎందుకు వప్పుకున్నానా అని కృష్ణవేణమ్మ వాపో యింది. పెట్టిన కాలు వెనక్కు తీసుకోవడం కష్టం. మొత్తానికి తీర్పు ఇచ్చాడు జడ్జి. లాయరు ఆశ పెట్టినట్లుగాదు. కేవలం అన్ని ఖర్చులు, నష్ట పరిహారం కల్పి లక్షా యాభైవేలు. అదయినా చేతికి అందాలంటే మూడేళ్ళు ఆగాలి. అంత వరకూ ఆ డబ్బు కోర్టులో వుంచి, వడ్డీతో సహా ఇస్తారట. సాక్ష్యానికి వచ్చినవారు, 'కేసు పూర్తయింది గ దమ్మా మా డబ్బులు మాకు పడెయ్యి' అన్నారు. తన సంపాదనలో కూడ బెట్టిందంతా చేర్చినా, ఈ కోర్టు చుట్టూ తిరగడంవల్ల ఖర్చయి పోగా మిగిలింది చాలా కొంచమే. కానీ ఆ సాక్షుల కవన్నీ అనవసరం. అప్పుతీసుకున్నట్లు పత్రం రాసిస్తానంటే, దయ దల్చినట్లు రెండు రూపాయల వడ్డీకి వప్పుకున్నారు. మూడేళ్ళు ఆ విషయం మరిచి, కోర్టు గొడవ తప్పిందిగాబట్టి ప్రశాంతంగావుంది. అక్కయ్య పిల్లలు మాత్రం, మూడేళ్ళు ఎప్పుడు పూర్తవుతాయా అని చకోర పక్షుల్లా కాచుక్కూర్చున్నారు. వడ్డీతో సహా కోర్టు రెండులక్షలు చేతికి ఇచ్చింది. దాంట్లో నలభై వేలు ప్లీడరు ఫీజులు, మరో పదివేలు కోర్టు, గుమస్తాల ఖర్చంటూ ప్లీడరు మింగేశాడు యాభైవేలు. సాక్షులకు అసలు పదివేలు, వడ్డీ ఏడువేల రెండు వందలు పోగా మిగిలింది లక్షా పదహేడు వేల చిల్లర. 'మేం కాక నీకెవ్వరున్నారే' అంటూ అక్కయ్యా పిల్లలూ వెంటబడ్డారు ఆ మిగిలిన డబ్బు వెంట. పేరుకు నష్టపరిహారం అయిదు లక్షలంటూ ఆశ చూపి లాయరు తన సంపాదన తనుచూసుకున్నాడు. ఎంగిలి మెతుకులను ఆశించినట్లు సర్టిఫికెట్లు ఇవ్వడానికి సర్పంచి పోలీసులు వగైరా, కేవలం సాక్ష్యం చెపడాన్కి అయిదు వేలు వడ్డీతో సహా గుంజిన పెద్ద మనుషులు వాళ్ళందరికీ పెట్టుబడిలేని సంపాదన. కృష్ణవేణమ్మ గారి నష్ట పరిహారంలో వాటాదార్లు. మిగిలిన నాలుగు డబ్బులూ అను భవించడాన్కి వీలుకుదరకుండా, చుట్టు ముట్టే జ్ఞాతులు - ఇదండీ నష్టపరిహారం కథ.

—రామడుగుల జ్ఞానప్రసూనాంబ
న్యూబోంబే